# రాముడు కావలె!

★ వి. వి. సుబ్రహ్మణ్యం ★

"ఆగ్రేకలరు బుష్‌కోటు తగిలించవయ్యా క్రీమ్‌కలర్ పాంటుపైన" అంటున్నాడు జగన్నాథరావుతో దర్జాగా, మాధవమూర్తి. మూర్తి తెల్లని ఫినేషిల్లు పంచ, అమెరికనుసిల్కు కుర్తా రాయంచరెక్కల రంగును తిరస్కరిస్తూ ఉంది. తెల్లగా మద్రాసు చలవమెరుగుతో,

"మూర్తీ మనము థియేటరుచేరేవేళకు డాన్సు సగము ఐపోతుందయ్యా......హాస్టలునుంచి ఆరుమైళ్ళుంది థియేటరు!"

"అవును రావుజీ దానికి నీ మేకప్‌కదాకారణ" మన్నాడు మూర్తి.

ఇంతలో ఆకసము విరిగి పడినట్లుగా రావుజీ "ఏమి స్టుపిడ్ రోగ్‌రానీవు. రాముడూ, మూడు దినములయింది రూముఊడ్చి. త్రాగడానికి నీళ్ళయినా కాలబెట్టకూడదేమిరా. పాపి. దున్నపోతా. మాట్లాడవేమిరా గుటకలు మ్రింగుతున్నావు"

రాముని కండ్లలో నీరైన గుండెనీళ్ళ ప్రవాహమై పోతోంది. నెత్తిన కొండలు పెట్టినట్లుగా నిట్టూర్పు విడుస్తున్నాడు. వేదనా భరముతో మూక జెందినాడు,

"చూడురా మూర్తీ యీనీచుడు! ఎంత గర్వముగా యీ మీన్‌ఫెలోకు, ఛీ యిక్కడంతా దుర్భరంగా ఉంది........"అంటూ రావు పండ్లు కొరుకుతున్నాడు. రాముణ్ణి కోపంతో తినే టట్లున్నాడు. డాన్సు, తన మేకప్‌అంతా కోపంలో పూడిపోయింది. వేడి రక్తంగదా రావుజీది కోపంలో ఉడికిపోతూంది, రాముణ్ణి ఒక్క దెబ్బ కొట్టినాడు.

ఆలోచనలో క్రుంగి, ఆకలిలో కుస్తీపట్టి నశించిన రామునిదేహము ఎండుటాకట్లు క్రిందపడింది కాని, వానిపరం మాట్లాడేవారెవరు? వాడా నెలకు పదిరూపాయల కూలీ. రావు నెలకు రెండువందలు కాలేజీహాస్టలుకు చెల్లించే దర్జాఆసామి,

దరిద్రునికి రోషముంటే మరీ చేటుకదా? పేదరాలికోపము పెదవుల చేటుకదా! తనకేమి పరాభవము సంభవించెనో ఆరామునిదృష్టికి తోచలేదేమో! కాని, వాడు సామాన్య మానవుడేకదా. ఏమో చెప్పరాని బాధతో ఉస్సురనుకొంటూ తను దేవునిలాగు పూజించే, తన కన్నదాతయగు హాస్టలువార్డను పంచ కేగినాడు, వార్డనుగారు అప్పుడే తాంబూలము నములుకొంటూ, సిగరెట్టు పీల్చుతూ, చిన్న సూదితో పండ్లు గుచ్చుకుంటూ రాకింగ్ కుర్చీపైన కూర్చునియున్నాడు, రాముడమాంతంగా ఆయన కాళ్ళపైనబడివెక్కి వెక్కి యేడుస్తున్నాడు.

"ఏమిరా, రాముడూ యేమైందిరాచెప్పరా....

"బాబూ... ... బ్రదుకలేనండీ, చాల బాధగా ఉందండి........"

"ఏమిరా విషయము?"

ఇంతలో యుద్ధమునకు సిద్ధమైనట్లు రావు, మూర్తు లిర్వురు వార్డనుతో రామునిపై పిర్యాదు చేయుటకు వచ్చినారు, వార్డను అడిగీ అడుగక ముందే, రావు రాముడు శుద్ధ చౌట వెధవ

యనియు, పనికిరానివాడనియు నానావిధాలుగా తిట్లు వాన కురిపించినాడు.

వార్డను శాంతమూర్తి. హాస్టలునౌకరు లంటే యెంతోదయ. కాని వీరిద్దరిమధ్య యేమిచేయునది లేక "రావుజీ, నేను విచారింపుతాను. మీరుపోండి భాయీ" అంటూ కోపారుణ నేత్రుడయినరావును, మూర్తిని చల్లగా పంపించినాడు.

మూర్తి మెల్లగా "జగన్నాథా. ఛీ, వాన్ని ఎందుకురా కొట్టినావు. పూర్ ఫెలో........" అన్నాడోలేదో రావుజీ మహారాజసంగా "ఛీ పోవయ్యా. నీవు మహా గాంధి దేవుడుకాని. నీయట్టివారిక్కడ ఈ హాస్టలులో ఉండబట్టి, యిచ్చినసొమ్మునకు తగిన ప్రతిఫలము కలుగ లేదు" అని ఖరారుగా అన్నాడు.

ఇంతలో హాస్టలంతా కొందరు రావును శ్లాంఘించేవారు. కొందరు తిట్టువారుగా నానావిధాలుగా వుద్రేకపూరితంగా మాట్లాడుకుంటున్నారు.

"రాముడూ, నీకు లక్షసార్లు చెప్పినానుకదరా హాస్టలు పిల్లవాండ్లతో తగవులువద్దని. నీకేమిరా, నీకష్టమేమో నాతో చెప్పకూడదేమిరా...."

"సామీ, వస్తూనేమూడుదినాలుగాకాలేదుకదా అని పనికివెళ్ళి తర్వాత సంగతులు మీతోచెప్పాదామను కొన్నానండి అంతలో యింతఆమాంతము జరిగిందండి, ప్రాణాలు నిల్పుకోలేనండి. చెప్ప లేని బాధ బాబూ."

"సంగతేమిరా, రాముడూ ?"

"నాయెల్లివాడు నాగులుగాడు మూడుదినాల క్రింద చెరువులోపడి చనిపోయినాడండి.... అంటు ఆకసము పగిలేటట్టుగా బోరున యేడుస్తూ ఒక్కుమ్మడి నరికి క్రిందపడిన పెద్ద చెట్టుమాదిరి క్రింద పడినాడు.

వార్డను నీరైపోయినాడు. ఊరకే కొంతసే పుండి........"రాముడు, ఏమి నిర్భాగ్యుడురా, నాగులుగాడెందుకు చెరువుకు పొయినాడు ?"

"సామి ఏమి దరిద్రమండీ, చేపలుపట్టి అమ్మి పొట్ట పోసుకుందామనికూడా ఆశించినానండి. నేనిక్కడ, నాభార్య కొందరి ఉద్యోగస్తుల బంగళాల్లో పనులుచేసినా సంసారముజరిగేది కష్టంగా ఉందండీ, నాకర్మ బాబూ, పోయినాడు ఉన్న ఒక్కడు నన్ను నాభార్యను కష్టంలో పెట్టి."

కటికి దరిద్రునికైనా కడుపుతీపికి కరవు లేదేమో ధనవంతులకు మదమే భూషణమేమో. కాదా ; కొడుకును చెరువునకు బలియిచ్చి మూడు నాళ్లు నౌకరుచేయకపోతే ఒకనికితిట్లు, దెబ్బలు. ముక్కు బెదరితే మూప్పై దినములు, మెడికల్ లీవు కొందరికి ఇదియేమి భగవాన్ మాయయో? సంఘ దోషమో ?

అంత వార్డను "రాముడూ, లేవరా, యేడ్చి ఫలమేమి. దేవుడేదిక్కు. నీకొడుకు నిచ్చినవాడు దేవుడు, నీకొడుకు దేవుని చేరుకున్నాడులే. ఇక్కడే అన్నముతిని పోరా." అన్నాడు.

"అన్నమేమి బాబు జగన్నాథ రావుగారు కడుపునిండుగా పెట్టినారండీ" అంటూ యేదో భరింపరాని వేదనతో శోషజెందినాడు. దర్రిద్రుడు గూడ సుఖాన్ని ఆశించితే దెబ్బతింటాడేమో ! హాస్టలులో రూములలో నీళ్లపెట్టి, చెత్తఊడ్చి, విద్యార్థులు చెప్పినదంతా—సిగరెట్లు, కాఫీలు అంగడినుంచి దెచ్చియిచ్చి—చేసినా పొట్టకూటికే కరవైంది రామునికి. ఉన్న ఒక్క బిడ్డ-రాముని బంగారుకొండ - నాగులుగాడు చెరువుపాలైనాడు ఇంక రాముని జీవిత మూలకందమే తెగిపోయింది. వాని గతియేమో విచారింపక రావుజీ పరమ నీచపు పురుగును చూచినట్లు రాముణ్ణి చూచినాడు. లోకమంత సూన్యంగా రాముని స్థూలదృష్టికి దోచిందేమో ! కానీ యీ పాడుసంఘానికి రాముడు కావలె !